


# కథ

పుట్టగంటి గోపీకృష్ణ

# అంటువ్యాధి

"వచ్చేటప్పుడు రైతుబజారు మీదగా వచ్చి కాసిని కూరగాయలు పట్టుకు రారాదూ..మళ్లీ రేపు అదే పనిగా వెళ్ళమంటే విసుక్కుంటారు"

వెనకనుండి భార్య చెప్తున్న మాటలకి సరే అన్నట్లు తల ఊపి బయటకు నడిచాడు మాధవరావు. రిటైర్ అయిన దగ్గర నుండి సాయంత్రం కాగానే బయటకు వాకింగ్‌కి వెళ్ళటం బాగా అలవాటయ్యింది.

మాధవరావుకి మొదటినుండి ఆరోగ్యంమీద శ్రద్ధ ఎక్కువ. ఉదయాన్నే యోగా, వాకింగ్ చెయ్యటం..ఆహార నియమాలు పాటించటం అలవాటు. రిటైర్ అయ్యాక జాగ్రత్తలు మరీ ఎక్కువ అయి ఇంట్లో వాళ్ళని విసిగించే స్థాయికి చేరుకున్నాయి! రకరకాల ఛానల్స్‌లో వచ్చే ఆరోగ్యానికి సంబంధించిన ప్రోగ్రాములన్నీ క్రమం తప్పక చూస్తూ పక్కవారికి ఉచిత సలహాలివ్వటం హాబీగా చేసుకున్నాడు. అయితే రోజూ సాయంత్రం వాకింగ్‌కి వెళ్ళటం మాత్రం ఆ వంకతో స్నేహితుల్ని కలవవచ్చనే!

రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పార్కువైపు వడి వడిగా అడుగులు వేశాడు మాధవరావు. ఒకప్పుడు పార్కులంటే, ఆడుకునే చిన్న చిన్న పిల్లల్తో నిండిపోయి వుండేవి. ఆడుకునే పిల్లవాడంటే, అలగా పిల్లవాడికి పర్యాయపదంగా మారిపోయిన ఈ రోజుల్లో, పార్కుల మీద గుత్తాధిపత్యం రిటైర్ అయిన ముసలివాళ్ళదే అనుకుని ముసి ముసిగా నవ్వుకున్నాడు.

పార్క్ దగ్గరకి చేరేటప్పటికి కుటుంబరావు బెంచీ మీద కూర్చుని పేపరు చదువుకుంటూ కనిపించాడు. అతడు కూడా మాధవరావు మిత్రబృందంలో ఒక సభ్యుడు.

"నీ పనే హాయి లేవయ్యా..మూడు రూపాయల పేపరు ఉంటే చాలు. ఉదయం వచ్చిన పేపర్ పట్టుకుని రోజంతా గడిపేస్తావ్!" చనువుగా పలకరిస్తూ పక్కన సెటిల్ అయ్యాడు.

కుటుంబరావు కూడా చాలాసేపటినుంచి ఎదురుచూస్తున్నాడులాగుంది, పేపర్ మడిచి పక్కనపెట్టి లోకాభిరామాయణంలోకి దిగిపోయాడు.

నెమ్మది నెమ్మదిగా మిగిలిన మిత్రులంతా చేరారు. పార్కులో లైట్లు వెలిగాయి. కాలం గడిచే కొద్దీ వారి చర్చ రసపట్టులో పడింది. వాదించేవారు..కోపగించేవారు..సర్దిచెప్పేవారు. సమాధానపడేవారు. ఆ సమయంలో వారి మొహాల్లోని వెలుగు, మనసుల్లోని ఉత్సాహం చూస్తే, రెండో బాల్యం అంటే ఏమిటో అర్థమవుతుంది.

పార్కు వాచ్‌మన్ వచ్చి గుర్తుచేసేవరకూ ఎవరికీ టైము చూసుకోవాలన్న ధ్యాస కూడా లేదు. నెమ్మది నెమ్మదిగా లేచి వెనక్కి ఇళ్ళకు బయలుదేరారు అందరూ.

"ఇంటికేగా..." అడిగాడు మాధవరావు కుటుంబరావుని.

"ఆ...అంతకంటే ఇంకెక్కడికి వెళ్తాను" అంటూ బదులు ఇచ్చాడు కుటుంబరావు.

"అయితే పద, నేను కూడా అటే వస్తాను. దారిలో కూరగాయలు తీసుకోవాలి"

కొద్దిదూరం నడిచాక సంభాషణ ఆరోగ్యం మీదకి మళ్ళింది.

మాధవరావు తన ధోరణిలో జాగ్రత్తలు చెప్పటం మొదలుపెట్టాడు. "జాగ్రత్తగా ఉండాలి. సుగర్ ఎంత వుందో చెక్ చేయించుకున్నావా? ఈ వయసులో మూలనపడితే ఎవరు చూస్తారు..మనమే జాగ్రత్తగా ఉండాలి"

"ఈ వయసులోకాక ఇంకే వయసులో మూలపడతారు. చోద్యం కాకపోతే..." పెద్దగా నవ్వుతూ తేలిగ్గా తీసేసాడు కుటుంబరావు.

"సరేలే..సరేలే..మీ ఇల్లు వచ్చినట్లుంది. నేను ఇటు వెళ్తున్నాను" అని బజారు వైపు వెళ్ళిపోయాడు మాధవరావు.

ఆ తరువాత వరసగా రెండు రోజులు సాయంత్రం కుటుంబరావు కనబడలేదు. ఏమయ్యిందో కనుక్కుందామని ఒక రోజు వాళ్ళింటికి వెళ్ళాడు మాధవరావు.

వాళ్ళ అబ్బాయి తలుపు తీసాడు.

"నాన్నగారికి రెండు రోజుల క్రితం గుండెల్లో నొప్పి వచ్చిందండి. హాస్పిటల్లో చేర్చాము" అని ఏ హాస్పిటల్లో ఉందీ వివరాలు చెప్పాడు.


"అయ్యో..ఇప్పుడెలా వుంది?" బాధపడుతూ అడిగాడు మాధవరావు.

"ఇప్పుడు బాగానే ఉందిలెండి. ఎలాగూ చేరారు కదా అని అన్ని పరీక్షలు చేయిస్తున్నాము. ఏమీ ప్రాబ్లం లేదని తెలిస్తే..అదొక తృప్తి కదండీ"

అతడికి తండ్రిమీద ఉన్న ప్రేమ చూస్తే ముచ్చటేసింది మాధవరావుకి.

ఇద్దరికీ పార్కులో పరిచయమే అయినా కుటుంబరావు హాస్పిటల్లో ఉన్నాడంటే ఏంటోగా వుంది. అదేరోజు విజిటింగ్ అవర్స్‌లో హాస్పిటల్‌కి వెళ్ళాడు మాధవరావు. దార్లో బేరంచేసి ఒక అరడజను ఆపిల్స్ కూడా కొన్నాడు.

మాధవరావు ఒక రకంగా చాలా అదృష్టవంతుడు. అతనికి ఆరోగ్యపరంగా పెద్దగా ఏ సమ



స్యలూ లేకపోవటంతో..ఇప్పటివరకూ హాస్పిటల్ జోలికి వెళ్ళవలసిన అవసరం రాలేదు. అందులో ఇప్పుడు కుటుంబరావు ఉన్న హాస్పిటల్ నగరంలోని ఖరీదయిన హాస్పిటల్లో ఒకటి కాబట్టి, అయిదు నక్షత్రాల హోటల్ తలదన్నేలా ఉంది.

రూమ్‌కి వెళ్ళే దారి తెలుసుకుని అటువైపు నడిచాడు మాధవరావు. కుటుంబరావుని ఏ పరిస్థితుల్లో చూడవలసి వస్తుందో అని భయపడుతూ రూమ్‌లోకి అడుగుపెట్టిన అతనికి అక్కడ దృశ్యం చూసి నోట మాట రాలేదు.

కుటుంబరావు బెడ్‌మీద పడుకుని సీలింగ్‌కి బిగించిన టి.వి.లో డైలీ సీరియల్ చూసుకుంటున్నాడు. బెడ్ సగం వరకూ పైకి ఎత్తి ఉంది టి.వి. చూడటానికి వీలుగా! తలకింద రెండు పెద్ద పెద్ద తలగడలు పెట్టి ఉన్నాయి. పేషెంటు పక్కన ఉన్న టేబుల్, ఒక చిన్న పళ్ళదుకాణంతో పోటీపడేలా అలరారుతోంది.

మాధవరావుని చూడగానే కుటుంబరావు మొహం ఆనందంతో వెలిగిపోయింది. "రావయ్యా, రా...ఏమీ తోచక చాలా ఇబ్బందిగా వుంది" అంటూ ఆహ్వానించాడు.

"ఇదేంటయ్యా..హాస్పిటల్లో చేర్చారంటే నిన్ను ఏ అవతారంలో చూడాలో..అని భయపడుతూ వచ్చాను. ఇక్కడ నువ్వేమో కులాసా పురుషుడిలాగా షోగ్గా ఎంజాయ్ చేస్తున్నావే"

"ఎంజాయ్‌మెంటా? నా బొందా? ఎన్ని సౌకర్యాలు ఉన్నా జైలు జైలే కదా"

"ఇంతకీ నీ గుండెల్లోనొప్పి సంగతి ఏమయ్యింది?"

"గుండెల్లో నొప్పీ లేదూ..పాడూ లేదు. అదంతా ఒక పెద్ద కథ"

"అది చెప్పమనేగా అడుగుతుంటా" ఎంత వద్దన్నా ఆతృత ఆగటం లేదు మాధవరావుకి.

"మా అబ్బాయి నాకు హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాడులే. దాని అవసరం ఇంతవరకూ ఎప్పుడూ రాలేదు. ఇహ ముందు కూడా రాదేమో అనే అనుకున్నాను" టీవీలో సీరియల్ అయిపోయినట్లుంది, అడ్వర్టయిజ్‌మెంట్లు వస్తున్నాయ్! పక్కన రిమోట్ అందుకుని ఛానల్ మారుస్తున్నాడు.

"సస్పెన్స్‌లో పెట్టకుండా తొందరగా చెప్పు"

"అదే..అదే! మొన్న ఒక రోజు హాస్పిటల్ వాళ్ళు మా అబ్బాయి దగ్గరికి వచ్చారంట. మీ ఇన్సూరెన్స్ కార్డు ఎప్పుడూ వాడరు కదా! అలా అయితే మీకేమి ఉపయోగం? మీ నాన్నగారిని మా హాస్పిటల్లో చేర్చండి. కార్డుమీద ఉన్న లిమిట్‌వరకూ వాడుకుని వదుల్తాము. అందుకుగానూ మీకే మేము తృణమో ఫణమో సమర్పించుకుంటాము అన్నారంట. అప్పటి నుండి మావాడు ఒకటే గోల నన్ను వచ్చి ఈ హాస్పిటల్లో చేరమని. చివరికి తప్పక చేరాను"

"నిజంగా ఇస్తారంటయ్యా..ఒకవేళ తరువాత వాళ్ళు ఇవ్వకపోతే" ఈర్ష్య బయటపడకుండా మేనేజ్ చేస్తూ అడిగాడు మాధవరావు.

"మనమేమన్నా కడితే కదా..మనకేమి సంబంధం లేదు. అంతా హాస్పిటల్ వాళ్ళే చూసుకుంటారు"

"ఒకవేళ ఎవరన్నా వచ్చి చెక్ చేస్తే?"

"నాకేమన్నా ఆపరేషన్లు చేస్తున్నారా, ఎదుటివాడికి కనపడటానికి. అన్ని ఖర్చులూ టెస్టుల పేరుతోనే చేస్తారు"

"మరి ఇవన్నీ ఏమిటి?" కళ్ళతో పక్కన పళ్ళ

దుకాణం వైపు చూపిస్తూ అడిగాడు.

"మా అబ్బాయి, వాళ్ళ ఆఫీసులో చెప్పినట్లున్నాడు నేను హాస్పిటల్లో ఉన్నానని. అందుకని వాడి కింద పనిచేసే వాళ్ళంతా పోటీలుపడి మరీ ఇవన్నీ తెచ్చి పడేసారు"

"సరేలే..తొందరగా బయటకురా..అక్కడ పార్కు దగ్గర నువ్వులేక అందరికీ బోరుగా ఉంది"

"వచ్చేస్తాలే..ఇంకెంత ఇంకో రెండు మూడు రోజులు"

స్నేహితుడి దగ్గర నుండి శెలవు తీసుకుని బయట కొచ్చిన మాధవరావు కాసేపు హాస్పిటల్ రిసెప్షన్ దగ్గర నిలబడి వచ్చేపోయే వాళ్ళని గమనించసాగాడు.

వచ్చినవాడు ఎలాంటి వాడయినా వాడి దగ్గర కార్డు ఉంటే చాలు, ఆఖరికి తెల్లరేషన్ కార్డు ఉన్నా..ఆదరంగా ఆహ్వానించి సాదరంగా లోపలికి తీసుకుపోతున్నారు. అదే ఎవరన్నా కార్డు లేని పేషంటు డబ్బులు కట్టటానికి రెడీ అయినా..వాడిని చీదరగా చూస్తూ తప్పనిసరి తద్దినంలాగా లోపలికి తోసుకుపోతున్నారు.

కుతూహలంకొద్దీ తనలాగే అక్కడ నిలబడి ఉన్న ఇంకొక వ్యక్తిని, దాని తాలూకూ రహస్యమేమిటని అడిగాడు.

"ఏముంది సార్..సొంత డబ్బులంటే..ఇదేమిటి? అంతెందుకు? అని సవాలక్ష ప్రశ్నలు వేస్తారు. డబ్బుల దగ్గర గీచి గీచి బేరాలాడుతారు. అదే కార్డు ఉంటే, ఇంక హాస్పిటల్ వాళ్ళకి పండగే! వాళ్ళు చెప్పిందే వేదం..వేసిందే బిల్లు"

జ్ఞానోదయమయింది మాధవరావుకి. ఇన్నాళ్ళూ కార్డులేకుండా తనెంత తెలివి తక్కువగా బతికాడో అర్థమయ్యింది. ఎలాగయినా కార్డు సాధించాలనే కృతనిశ్చయంతో హాస్పిటల్ నుండి బయటికి వచ్చిన అతనికి, అది అంత తేలిక కాదని త్వరగానే తెలిసింది.

ఏ ఇన్సూరెన్సు కంపెనీకి వెళ్ళినా ముసలివాళ్ళకి ఇచ్చే కార్డులేమీ వాళ్ళ దగ్గర లేవంటున్నారు. "అందులో మీరేమో రిటైర్ అయ్యానంటున్నారు. సీనియర్ సిటిజన్స్ని అసలు చేర్చుకోము" అని ఖరాఖండిగా చెప్పింది కౌంటర్లోని పిల్ల.

"ఇదేమి అన్యాయమమ్మా..దాని అవసరం ముసలి వాళ్ళకే కదా! కుర్రవాళ్ళకి దానితో ఏమి అవసరం వుంటుంది?" ఆశ్చర్యంగా అడిగాడు మాధవరావు.

"అవసరం లేనివి దొరకటమే జీవితం సర్! అవసరం ఉన్నవి ఛస్తే దొరకవు. నాకు లక్ష్మీమిట్టల్కున్నంత డబ్బు కావాలని వుంటుంది. దొరుకుతుందా? ఆ డబ్బు ఆయనకెందుకు? స్టీలు ఫాక్టరీలు పెట్టటానికి తప్ప. అదే నా దగ్గర అంత డబ్బు ఉంటేనా..." అంటూ ఊహల్లోకి వెళ్ళిపోయింది. ఆ తరువాత ఎంత పిలిచినా పలకలేదు.

వేరే కంపెనీలకి కూడా తిరిగాడు కానీ రెస్పాన్స్ అన్ని చోట్ల దాదాపు ఒకేలా వచ్చింది.

పోనీ కనీసం తెల్లరేషన్ కార్డు అన్నా సంపాదిద్దామని..ఆ ప్రయత్నం మొదలుపెట్టాడు. అందర్నీ ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించే ఎమ్మార్వో, ఇతన్ని చూసి జడుసుకునే స్థాయికి వచ్చాడు. "ఏమిటి తాతగారూ ఈ హింస.. ఇంత ప్రయత్నం చేస్తే పరమశివుడే ప్రత్యక్షమవుతాడే..అలాంటి ప్రయత్నమేమన్నా చేసుకోక, మా మీద ఏమిటీ దాడి? మీరు ఏమి చేసినా పెన్షన్ తీసుకునే వాళ్ళకి తెల్లరేషన్ కార్డు ఇచ్చి నా ఉద్యోగానికి ప్రమాదం కొనితెచ్చుకోలేను" అని కాళ్ళు పట్టుకుని ప్రాధేయపడటంతో ఆ ప్రయత్నం కూడా విరమించవలసి వచ్చింది.

'ఇక తన జీవితం ఇంతే. రేపు ఏ

## అవన్నీ గాలివార్తలే!

ఈమధ్య సల్మాన్ ఖాన్ ఓ భారీ గిఫ్ట్ని అశిన్కిచ్చి ఆమెని ఇంప్రెస్ చేసేశాడని తెగ చెప్పేసుకున్నారంతా. దీనికి అశిన్ కాస్త ఆలస్యంగానైనా స్పందించింది. 'నాకు ఓణమ్ పండగ కానుకగా సల్మాన్ ఏదో పెద్ద గిఫ్టు ఇచ్చాడని, కొంతమందయితే ఏకంగా ఓ ఇంటినే ఇచ్చాడని చెప్పేసుకున్నారు. అలాగే నేను కూడా ఆయనకి ఈద్ సందర్భంగా కానుక ఇచ్చానని చెవులు కొరుక్కున్నారంతా. అసలు ఆ టైములో మేమిద్దరం ఓ షూటింగ్లో బిజీ బిజీగా వున్నాం గానీ గిఫ్టులిచ్చుకునేంత తీరిక, టైము మాకు లేనే లేదు. పనీపాటాలేని వాళ్ళ ప్రచారం ఇదంతా' అని కొట్టిపారేసింది.



జబ్బు వచ్చినా కార్డులేని నన్ను ఎవరు పట్టించుకుంటారు?' అని మథనపడిపోవటం మొదలయింది.

ముందు ఇంట్లో వాళ్ళకి అర్థం కాలేదు కానీ నెమ్మదిగా విషయం తెలుసుకుని మాధవరావుకి నచ్చచెప్పే ప్రయత్నం చేసారు.

"మీకెందుకు నాన్నా...కార్డు లేనంత మాత్రాన మిమ్మల్ని వదిలి వేస్తామా? మేము చూసుకుంటాము కదా" అంటున్న పిల్లలు అమాయక పక్షుల్లా కనపడ్డారు మాధవరావుకి.

"ఏమిట్రా మీరు చూసుకునేది? సొంత డబ్బులు పెట్టి నన్ను ఒక వారం మంచి హాస్పిటల్లో ఉంచేటప్పటికి..మీ అందరి ఆస్తులూ ఉమ్మడిగా అమ్మినా సరిపోవు. మీరేమో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులన్నా కాకపోతిరి, మీ కార్డుమీద నన్ను చూపించటానికి. మీరెన్ని వ్యాపారాలు చేసినా..ఎంత సంపాదించినా..మీ సంపాదన నా హాస్పిటల్ బిల్లు కట్టటానికి సరిపోదు. తరువాత మీరే నన్ను తీసుకువెళ్ళి ఏ గవర్నమెంటు హాస్పిటల్లోనో పడేస్తారు. నా చావు కుక్క చావే"

ఎంత చెప్పినా వినని మాధవరావు...దిగులుతో బయటకు వెళ్ళటం కూడా తగ్గించి వేసాడు. అంతవరకూ లేని ఆరోగ్య సమస్యలు నెమ్మదిగా దరి చేరుతున్నాయి.

ఈ మనిషిని మన లోకంలోకి తేవడం ఎలాగో అర్థంకాని కుటుంబ సభ్యులు ఆఖరికి సైకియాట్రిస్ట్ సలహా కూడా తీసుకున్నారు. కానీ..ఆయన కౌన్సిలింగ్ కూడా ఏమీ ప్రభావం చూపలేకపోయింది. చివరికి ఆయన చేతులెత్తేసి- "మీ నాన్న బాగుపడాలంటే ఒకే ఒక మార్గమయ్యా" అని ఒక సలహా చెప్పాడు.

దాని ప్రకారం కష్టంమీద ఒక దొంగకార్డు తన తండ్రి పేరుమీద సృష్టించుకొచ్చిన మాధవరావు కొడుకు- "ఇదుగో నాన్నా, నాకు తెలిసిన వారి ద్వారా అతికష్టం మీద కార్డు సంపాదించాను. ఇక నీకు ఏ బాధా లేదు" అని తను తెచ్చిన దొంగకార్డు ఇచ్చాడు.

ఆత్రంగా అందుకున్న మాధవరావుకి కొండంత ధైర్యం వచ్చింది. చాలారోజుల తరువాత కాస్త తెరిపి నపడినట్లు కనిపించాడు. ఒక ఆరునెలల్లో నెమ్మదిగా మామూలు ప్రపంచంలో పడుతున్నాడు అనుకుంటున్నంతలో మళ్ళీ కొత్తగోల మొదలయింది.

"ఆ కార్డు టైము అయిపోయేలోపు నన్ను కూడా మంచి హాస్పిటల్లో చేర్చి టెస్టులన్నీ చేయించండ్రా..అయినా మీకేమి బాధ, కార్డుందిగా" అని మొదలుపెట్టిన మాధవరావుకి ఏమి చెప్పాలో అర్థం కాని కొడుకులు, హాస్పిటల్ వాళ్ళకి మామూలుకంటే ఎక్కువ డబ్బులు కట్టి మరీ మాధవరావుని హాస్పిటల్లో చేర్చి అన్ని టెస్టులూ చేయించారు.

ఇప్పుడు మాధవరావు పూర్తిగా మామూలు మనిషి అయ్యాడు. సాయంత్రాలు పార్కు దగ్గరికి కూడా వెళ్తున్నాడు. స్నేహితులందరికీ హాస్పిటల్లోని సౌకర్యాల గురించీ..కార్డు ఉంటే కలిగే వెసులుబాటు గురించీ, కథలు కథలుగా చెప్తున్నాడు.

కాకపోతే మాధవరావుకి తగ్గిన అసంతృప్తి, ఆందోళన...అతి త్వరలోనే అతని మిత్రబృందంలోని మరో ఇద్దరిని పట్టుకున్నాయి.

ఎవరన్నారు మానసిక వ్యాధులు అంటువ్యాధులు కావని.

## నేహా అందాలు

నేహా ధుపియాకి బాలీవుడ్‌లో చెప్పుకోదగిన సినిమాలు లేకపోయినా నిత్యం ఎక్సర్‌సైజులు చేస్తూ, డైటింగ్‌లు గట్రాలతో నిత్యనూతనంగా స్లిమ్‌గా వుండేందుకు తెగ ప్రయత్నాలు చేస్తుందిట. సినిమాలు ఎక్కువగా చేయనంత మాత్రాన నా పర్సనాలిటీ గురించి నిర్లక్ష్యం చేయాలా? నా ఫిగర్‌లో తేడాలు రాకుండా జాగ్రత్తపడడంలో తప్పేంటి చెప్పండి? అంటూ ప్రశ్నిస్తోంది. ఆమె ఈమధ్య కొత్తగా ఓ సినిమాని ఒప్పుకుంది. ఇందులో నేహా గ్లామర్‌ని గనక చూస్తే ప్రేక్షకులు అలా నోరెళ్లబెట్టాల్సిందే అంటోంది ఆమెనే స్వయంగా. చూద్దాం.

